సాక్షి
ఖమ్మం
మంగళవారం, 24, జనవరి, 2023



బాలికలకు బాసటగా..

బాలికలకు అండగా నిలుస్తున్న చట్టాలు, న్యాయసేవాధికారి సంస్థ సేవలపై నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కథనం. 10లో



జగనన్న దీవెనతో ఎంపీనయ్యా..

పేదరికం అనుభవించిన తాను ఏపీ సీఎం జగన్ దీవెనలతో ఎంపీగా గెలిచానని ఏపీలోని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 16°

వాతావరణం

మంగళవారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం తర్వాత చలి గాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించండి



సమస్యలు వింటున్న అడిషనల్ డీసీపీ

ఖమ్మంక్రైం: వివిధ సమస్యలపై ప్రజలు చేసే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శబరీష్ అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఆయన ఫిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. అలాగే, తక్షణ చర్యల నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, భూవివాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించినవే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు తెలిపారు.

దళితబంధుతో ఆర్థికాభివృద్ధి



యూనిట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: దళితబంధు యూనిట్లను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని నర్సింహాపురం, పాతర్లపాడు గ్రామాల్లో దళితబంధు యూనిట్లను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్నిరంగాల్లో వెనుకబడిన దళితుల అభ్యున్నతి కోసం దేశంలోనే తొలిసారిగా సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈమేరకు యూనిట్లతో ఆర్థికంగా ఎదగడమే కాక మరికొందరికి ఉపాధి కల్పించాలని చెప్పారు. అనంతరం 14 మందికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సిఫారసుతో మంజూరైన రూ.5.24 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను చైర్మన్ అందజేశారు. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్‌లు ఆలస్యం నాగమణి, కాంద్ర పిచ్చయ్య, పరిటాల యలమంద, చాట్ల సురేష్‌తో పాటు గురిజాల హన్మంతరావు, నల్లమోతు శేషగిరిరావు, మంకెన రమేష్, పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం



కేంద్రంలో పరిశీలిస్తున్న డీఐఓ ప్రమీల

నేలకొండపల్లి: అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ డి.ప్రమీల తెలిపారు. మండలంలోని బోదులబండలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజలంతా శిబిరాన్ని వచ్చేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి గీత, పీహెచ్‌ఎన్ వాణి తదితరులు పాల్గొన్నారు.

గోపన్నపై నిర్లక్ష్యమేలా!





రంగులు కూడా వేయని రామదాసు ధ్యాన మందిరం (ఇన్‌సెట్) మందిరంలో ఉత్సవమూర్తులు

- రామదాసు మందిరాన్ని దత్తత తీసుకున్న భద్రాద్రి ఆలయం
- అయినా అభివృద్ధి అంతంతే..
- జయంతోత్సవాలకు మొక్కుబడిగానే ఏర్పాట్లు
- తాగునీటి సౌకర్యం కూడా లేక సందర్శకుల విలవిల

నేలకొండపల్లి: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నిర్మాత, పరమ భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడైన భక్త రామదాసు(కంచర్ల గోపన్న) మందిరం నిరాదరణకు గురవుతోంది. ప్రస్తుత ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కంచర్ల లింగనమంత్రి – కామాంబ కుమారుడు కంచర్ల గోపన్న తన మేనమేమల ప్రోత్సాహంతో గోల్కొండ నవాబుల హయాంలో ప్రస్తుతం భద్రాచలం ఉన్న పాల్వంచ పరగణా తహసీల్దార్‌గా పనిచేయడం.. 1655లో రాముడు కలలోకి వచ్చాడని నమ్మి ఆలయాన్ని నిర్మించడం.. దీంతో ప్రజల సొమ్మును కాజేశారని గోల్కొండ తానీషా గోపన్నను జైలులో పెట్టాడని భక్తులు నమ్మిక. ఆతర్వాత రామలక్ష్మణులు తానీషాకు చేసిన సూచనలతో రామదాసును చెరసాల నుంచి విడుదల చేయగా.. ఆయన భక్తాగ్రేసరుడిగా పేరొందాడని చెబుతారు. కాగా, గోపన్న పదో తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు కొత్తగూడెంలో నివాసముంటుండగా.. ఆయన స్వస్థలంలో ఉన్న ధ్యానమందిరం నిరాదరణకు గురవుతుండడంతో స్థానికులకు కలిచివేస్తోంది. ఏటా గోపన్న జయంతోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ తూతూ మంత్రంగా చేసే ఏర్పాట్లతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు.. బావి

నేలకొండపల్లిలోని రామదాసు నివసించిన ఇంటిని ఆధునికీకరించి ధ్యాన మందిరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఆయన వాడిన బావిని కూడా చూడొచ్చు. కొన్నేళ్ల క్రితం ధ్యానమందిరాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నప్పటికీ నిధులు విదల్చటం లేదు. కనీసం జయంతోత్సవాలకు కూడా పెద్దగా నిధులు కేటాయించడం లేదనే చెప్పాలి. ధ్యాన మందిరంలో అపరిశుభ్రత రాజ్యమేలుతున్నా, ప్రహరీ కూలి రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక్కడ సందర్శనకు వచ్చే వారికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోపక్క మందిరంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు ఏళ్ల తరబడి సాగుతుండడం గమనార్హం. ఇవేకాక రామదాసు పదో తరం వారసులను గుర్తించకున్నా వారు ఏటా జయంతోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

మొక్కుబడిగానే ఉత్సవాలు

ఈనెల 25 నుంచి నిర్వహించనున్న భక్త రామదాసు జయంతోత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా పాలనా యంత్రాంగం, భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, కార్యక్రమానికి ఇంకా రెండు రోజులే సమయమున్నా మందిరానికి ఇప్పటికీ రంగులు వేయలేదు. ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి, కూలిన ప్రహరీని పునర్నిర్మిస్తే కాస్త అందంగా కనిపించేది. కానీ భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నా అలాంటివేమీ జరకపోగా, కనీసం ఉత్సవాల నిర్వహణపై ప్రచారం కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆలయం ఆధ్వర్యానే నిర్వహించాలి



రామదాసు ధ్యానమందిరాన్ని భద్రాచలం దేవస్థానం పూర్తి స్థాయిలో దత్తత తీసుకోవాలి. భద్రాచలం ఆలయ కమిటీలో నేలకొండపల్లి నుంచి శాశ్వత సభ్యుడికి స్థానం కల్పించాలి. అంతేకాక రామదాసు జయంతోత్సవాల నిర్వహణకు ఖర్చు పూర్తిగా ఆలయమే భరించి.. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని కూడా నియమించాలి.

– రాయపూడి నవీన్, సర్పంచ్, నేలకొండపల్లి

కమిటీని ఎప్పుడు ఎన్నుకున్నారు?



రామదాసు జయంతి ఉత్సవాలను ప్రభుత్వ శాఖలే నిర్వహించాలి. మందిరాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నా, విద్వత్ కళాపీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహించటం ఏమిటో అర్థం కావటం లేదు. ఈ కమిటీని ఎప్పుడు ఎన్నుకున్నారు, విధివిధానాలు ఏమిటో బహిర్గతం చేయాలి.

– పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి

దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహిస్తాం..



రామదాసు ధ్యాన మందిరంలో ఉత్సవాలను దేవస్థానమే నిర్వహిస్తుంది. ఆలయ అర్చకుల వేతనాలు, పూజా సామగ్రి, వస్త్రాలు ఇతరత్రా సౌకర్యాలను సమకూరుస్తాం. విద్వత్ కళాపీఠం కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నాం. అలాగే, ఆడిటోరియం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించాం.

– బి.శివాజీ, భద్రాద్రి దేవస్థానం ఈఓ, భద్రాచలం

ప్రజావాణి కొత్తకొత్తగా..



రైతు సంఘం నాయకుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన మంత్రి అజయ్‌కుమార్

- నూతన కలెక్టరేట్‌లో తొలిసారిగా నిర్వహణ
- ఓపిగ్గా సమస్యలు విన్న కలెక్టర్ గౌతమ్
- ఖమ్మం కలెక్టరేట్‌కు అరుదైన అవకాశం దక్కిందన్న మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: కొద్దివారాల విరామం తర్వాత సోమవారం నూతన కలెక్టరేట్ సముదాయంలో తొలిసారి నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)కి ప్రజలు పోటెత్తారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించాక ప్రజావాణిని సోమవారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వ్యక్తిగత, భూసమస్యలు తదితర అంశాలపై వినతిపత్రాలు ఇచ్చేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల వారు పెద్దసంఖ్యలో వచ్చారు. దీంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అందరికీ టోకెన్లు ఇప్పించి క్యూపద్ధతిలో వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అంతేకాక ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల అధికారులకు సూచనలు చేశారు. కాగా, కొందరు ఉపాధ్యాయులు బదిలీ విషయమై రావడంతో «నివాసం వద్ద బడి ఉండదు, బడి దగ్గరకు మనమే వెళ్లాలి. మరోసారి ఈ అంశంపై వస్తే సస్పెండ్ చేస్తాను» అని హెచ్చరిక చేసి పంపించారు. ఇంకా ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీషతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా...

- నేలకొండపల్లికి చెందిన వృద్ధురాలు టి.పుల్లమ్మ, ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన ఎం.డీ.సఫియా మానసిక దివ్యాంగుడైన తన కుమారుడికి పింఛన్ ఇప్పించాలని కోరారు.
- ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీలో షెడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ ఇంటూరి పుల్లయ్య తనకు బిల్లు ఇప్పించాలని విన్నవించారు.
- ఖమ్మం రమణగుట్టకు చెందిన దాసరి సుజాత తన ఇంటి స్థలం రెగ్యులరైజేషన్ ఫీజును తగ్గించాలని దరఖాస్తు అందజేశారు.
- వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన గంటా కిరణ్‌కుమార్ తనకు రైతు బంధు సాయాన్ని పునరుద్ధరించాలని కోరాడు.



ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారులు

- కల్లూరుకు చెందిన వెన్నం బసవయ్య ధరణిలో నమోదైన భూమికి పాస్‌పుస్తకం ఇప్పించాలని వినతిపత్రం అందజేశాడు.
- రఘునాథపాలెం మండలం జింకలతండాకు చెందిన బోడ శంకర్ తన భూమిని కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి తీసుకున్నందున జింకలతండా వద్ద నిర్మించిన గోదాంలో ఉపాధి కల్పించాలని కోరాడు.
- కొణిజర్ల మండంలోని సింగరాయపాలెం, తీగల బంజర, లక్ష్మీపురం పరిధిలో 400 ఎకరాలకు సంబంధించి 200 మంది రైతుల వివరాలు రికార్డుల్లో సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నందున పరిష్కరించాలని రైతులతో కలిసి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తదితరులు విన్నవించారు.

భూమి బదలాయించాలి



నా కుమారుడు మృతి చెందాడు. ఆయన పేరిట ఉన్న భూమి నా పేరుపైకి మార్చి పట్టా పుస్తకం ఇప్పించాలి. తద్వారా రైతు బంధు వచ్చేలా చూడాలని కోరాను. కలెక్టర్ సార్ మంచిగా మాట్లాడారు.

– వి.గౌరమ్మ, చింతకాని

పింఛన్ రావడం లేదు...



నడవలేని స్థితిలో ఉన్న నాకు సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ రావడం లేదు. మా అమ్మతో వచ్చి కలెక్టర్ సార్‌కు గోడు చెప్పుకున్నా. అక్కడికక్కడే సమస్య పరిష్కరించాలని అధికారికి చెప్పారు.

– షేక్ హుస్సేన్, నాగులవంచ

దేశంలో ఎవరికీ దక్కని గౌరవం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



దేశంలో ఎవరికీ దక్కని అరుదైన గౌరవం ఖమ్మం జిల్లాకు దక్కడం గర్వంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్‌లో మొదటి గ్రీవెన్స్ డేకు హాజరైన ఆయన మంత్రి మాట్లాడుతూ ఖమ్మం కలెక్టరేట్‌ను నలుగురు ముఖ్యమంత్రులు ప్రారంభించడం గతంలో ఎక్కడా జరగలేదని, భవిష్యత్‌లో జరగదని తెలిపారు. గ్రీవెన్స్‌కు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. అటు ప్రజలు, ఇటు ఉద్యోగుల సౌకర్యార్థం ఖమ్మం నుండి కలెక్టరేట్ వరకు సిటీ బస్సులను నడిపిస్తామని మంత్రి పువ్వాడ తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- మూడు కేంద్రాలు.. రెండేసి సెషన్లలో పరీక్ష
- హాజరుకానున్న 5,263మంది విద్యార్థులు



ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహించే జెఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్షలు 24, 25, 28, 29, 30, 31వ తేదీలతో పాటు ఫిబ్రవరి 1వ తేదీన జరగనున్నాయి. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 5,263మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం పరీక్ష 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుంది. కాగా, ఉదయం పరీక్షకు 8–30గంటల్లోగా, మధ్యాహ్నం పరీక్షకు 2–30గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మూడు కేంద్రాలు

జేఈఈ మెయిన్స్, బీఆర్క్ పరీక్షకు 5263మంది విద్యార్థులు హాజరుకానుండగా జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేశారు.ఖమ్మం ఎస్‌బీఐటీలో 2,282మంది, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని కిట్స్‌లో 1465, కొణిజర్ల మండలం తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలకు 1,516 మందికి పరీక్ష కేంద్రం కేటాయించారు. కాగా, విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ట్రాన్స్‌పరెంట్ పెన్ను, అడ్మిట్ కార్డు, పాస్‌పోర్టు /ఆధార్‌కార్డు/రేషన్ కార్డుల్లోఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జేఈఈ మెయిన్స్, బీఆర్క్ పరీక్షలు జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేశాం. ఏడు రోజుల పాటు రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులు తప్పక మాస్క్ ధరించి రావాలి. అభ్యర్థులంతా ఒకేసారి కాకుండా వారికి కేటాయించిన సమయంలో కేంద్రాలకు చేరుకోవాలి.

– ఆర్.పార్వతిరెడ్డి, పరీక్షల సిటీ కోఆర్డినేటర్

నూతన భవనంలోకి డీసీఎంఎస్ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం త్రీటౌన్‌లో కొనసాగుతున్న జిల్లా సహకార మార్కెటింగ్(డీసీఎంఎస్) శాఖ కార్యాలయాన్ని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ రోడ్‌లో ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయంలోకి మార్చారు. ఈ భవనంలో చేపట్టిన మరమ్మతులు పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. త్వరలోనే నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ వెంకటశేషగిరిరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్‌హెచ్‌జీలకు అండగా నాబార్డ్

ఖమ్మంవ్యవసాయం: స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల అభివృద్ధికి నాబార్డ్ సంస్థ కృషి చేస్తోందని సంస్థ జిల్లా డీడీఎం సుజిత్ కుమార్ తెలిపారు. ఖమ్మంలో ఏర్పాటుచేసిన స్తంభాద్రి గ్రామీణ కళామేళా సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీడీఎం మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన వస్తువుల తయారీకి సంఘాల మహిళలు ప్రాధాన్యత ఇస్తే లాభసాటిగా ఉంటుందని తెలిపారు. ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. డీసీసీబీ సీఈఓ ఏ.వీరబాబు, జీఎం ఆర్.ఉపేందర్‌రావు, ఎస్‌ఎస్‌టీ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు, జాగృతి సంస్థ కోఆర్డినేటర్ కె.కొండల్‌రావుతో పాటు వి.రాజేష్, మాధవి, వెంకటనర్సయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్తంభాద్రి గ్రామీణ కళామేళను సోమవారం రాత్రి అదనపు కలెక్టర్ స్నేహలత సదర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. జాగృతి సంస్థ కార్యదర్శి ఎం.కుముదిని తదితరులు పాల్గొన్నారు.



బిస్కెట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి విక్రయానికి పోటెత్తింది. అధికారిక లెక్కల ప్రకారం 37,610 బస్తాల మిర్చిని రైతులు విక్రయానికి తీసుకురాగా... ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని చెబుతున్నారు. మిర్చి క్వింటాకు రూ.20 వేల వరకు ధర పలుకుతుండడంతో ఖమ్మంతో పాటు భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు తీసుకొచ్చారు. కాగా, కొత్త మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.19,500, కనిష్టంగా రూ.13,500 ధర పలకగా, నిల్వ మిర్చి గరిష్ట ధర రూ.19,200, కనిష్ట ధర రూ.17 వేలుగా నమోదైంది.

హిప్‌హిప్ హుర్రే... జిప్ సైక్లింగ్





రోప్ వేపై జిప్ సైక్లింగ్ చేస్తున్న వ్యక్తులు

ఖమ్మం ప్రజలు, పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మించిన లకారం ట్యాంక్‌బండ్ రోజురోజుకు కొత్త అందాలు సంతరించుకుంటోంది. ఇప్పటికే బోటింగ్, సస్పెన్షన్ బ్రిడ్జి పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతుండగా.. మరింత ఆకర్షణగా జిప్ సైక్లింగ్ అందుబాటులోకి వచ్చింది. ప్రతిరోజు సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల వరకు జిప్ సైక్లింగ్ చేయొచ్చని కేఎంసీ అధికారులు తెలిపారు. గాలిలో వేలాడుతున్నట్లుగా తీగలపై సైకిల్ తొక్కడం కొత్త అనుభూతిని పంచనుండగా... టికెట్ ధర రూ.50గా నిర్ణయించారు.

– ఖమ్మం మయూరిసెంటర్

క్లుప్తంగా

సహకార అధికారి మృతికి సంతాపం



జ్యోత్స్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజి్స్ట్రార్‌గా పనిచేస్తున్న జినుగు జ్యోత్స్న(44) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఆమె ఇంట్లో జ్యోత్స్న మృతదేహం వద్ద డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేష గిరిరావు, అధికారులు, ఉద్యోగులు నివాళులర్పించారు. కారేపల్లి, కామేపల్లి మండలాల సహకార సంఘాల అసిస్టెంట్ రిజి్స్ట్రార్‌గా, ఆడిట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జ్యోత్స్నకు భర్త మాధవ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చింతకాని: పశువులకు సోకే వ్యాధుల విషయంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా చైర్మన్ కొర్లకుంట నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని రేపల్లెవాడలో సోమవారం ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులు వ్యాధుల బారిన పడితే వెంటనే చికిత్స చేయించాలని తెలిపారు. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్ అంగిడి ఝాన్సీ, ఉపసర్పంచ్ మడుపల్లి రమేష్, పశు వైద్యులు ఉప్పు శ్రీహరి, సూపర్‌వైజర్లు శంకరయ్య, రాగిణి, వెంకటేశ్వరరావు, గోపాలమిత్రలు వెంకటేశ్వరరావు, నర్సింహారావు, రాంచందర్, రవి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్ ఫిర్యాదుపై కేసు

కూసుమంచి: అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మండలంలోని గోపాలరావుపేటకు చెందిన ఇంటూరి శేఖర్‌కు కూసుమంచి రెవెన్యూ సర్వే నంబర్ 329లో భూమి ఉంది. ఈ భూమి హద్దులు మార్చి అందులో నుంచి ఏడు గుంటల భూమి తనదేనని చెబుతూ మునిగేపల్లికి చెందిన జొన్నలగడ్డ రవి.. గోపిదేశి రమణకు విక్రయించి రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు. ఈవిషయం తెలుసుకున్న శేఖర్ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,150	7,100
కందులు	6,644	6,300
మిర్చి కొత్తవి	19,500	13,500
నిల్వమిర్చి	19,200	17,000
మిర్చి తాలు	10,000	7,500
పత్తి	8,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,881

ఏ గూటి పక్షులు ఆ గూటికే...

తుదిశ్వాస వరకు జనం కోసమే..

- నా అనుచరులను ఇబ్బంది పెడితే ఉపేక్షించం
- 2014 నుంచీ హామీలకే పరిమితమవుతున్న 'పోడు'
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి, పక్కన కనకయ్య, విజయ్‌బాబు తదితరులు

ఇల్లెందురూరల్: భవిష్యత్ కార్యాచరణ ప్రకటించకముందే తాను నిర్వహించే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు రాకుండా కొందరు అడ్డుకుంటున్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అయితే, ఎన్నటికైనా ఏ గూటి చిలక ఆ గూటికే చేరుతుందనే విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని మండలంలోని లలితాపురంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి రాగా, ప్రజలు ఆశీర్వదించి ఎంపీని చేశారని గుర్తుచేశారు. ఆతర్వాత రాజకీయ క్రీడలో పదవిని కోల్పోయినా ప్రజాభిమానాన్ని పదింతలు సంపాదించుకున్నానని అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రజల ఆశీర్వాదంతో తొలిసారిగా 2014లో ఎన్నికల బరిలోకి వచ్చానని, ఫలితాలు రాకముందే తమకు మద్దతు నివ్వాలని ఒత్తిడి చేశారని గుర్తుచేశారు. రెండున్నరేళ్ల తర్వాత ప్రజామోదంతో టీఆర్ఎస్(ప్రస్తుతం బీఆర్ఎస్)లో చేరగా, తనకు, తన అనుయాయులకు పదవులు ఇవ్వకుండా బుజ్జగింపులతో కాలయాపన చేశారని ఆరోపించారు. 2018 ఎన్నికల్లో జిల్లా నుంచి టీఆర్ఎస్ తరఫున ఒక్కరే గెలిచారని, ఈక్రమంలో రాజకీయ కురువృద్ధ నేతలు, లాబీయింగ్ చేసే నేతల మాటలు నమ్మి రాత్రికి రాత్రే వేరే పార్టీలో నుంచి చేర్చుకొని ఖమ్మం ఎంపీ సీటు కట్టబెట్టారని విమర్శించారు. ఆ సమయంలో తనను ఇండిపెండెంట్‌గా బరిలో దిగాలని అభిమానులు ఒత్తిడి చేసినా కేటీఆర్ హామీకి తోడు విలువలకు కట్టుబడిన వ్యక్తిగా అలా చేయలేదన్నారు. ఇక తాను పార్టీలో చేరిన సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏదీ అమలు చేయకపోయినా ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని పొంగులేటి వెల్లడించారు.

పోడుపై 2014 నుంచి హామీలే..

దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పోడుభూములకు పట్టాలిచ్చారని, ఎన్టీఆర్ రూ.2కు కిలో బియ్యం ఇచ్చి జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పొంగులేటి గుర్తుచేశారు. కానీ పోడు సమస్య పరిష్కరిస్తామంటూ 2014 నుంచి హామీలు ఇస్తున్నారే తప్ప నేటికీ పరిష్కరించడం లేదన్నారు. విలువలు, విశ్వసనీయతకు అంత తేడా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండేది కేవలం మూడు నెలలేనని, ఈ మూడు నెలలపాటు తమ అనుయాయులను అధికారంతో ఇబ్బంది పెడితే ఊరుకోబోనని, గాంధేయ మార్గంలో దీక్ష చేసి ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు.

యుద్ధానికి సిద్ధం కండి

పొంగులేటి నాయకత్వంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి కార్యకర్తలు సిద్ధం కావాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గతంలో ఎమ్మెల్యేగా తన పరిపాలన, ప్రస్తుత ఎమ్మెల్యే పరిపాలన బేరీజు వేసుకోవాలని శ్రేణులకు సూచించారు. తనను నమ్ముకున్న వారికి నాలుగేళ్లుగా అవమానాలు, బెదిరింపులు, పోలీసు కేసులు తప్పకపోవడంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వ విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్‌లో కొందరు నాయకులు, కార్యకర్తలకు పడిన అవమానాలు, అవహేళనల వల్లే నేడు ప్రజాభిప్రాయం కోరుతూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో జిల్లా స్థాయిలో నాయకత్వం వహించిన వారిని నేడు పలకరించే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ, ఎంపీపీ చౌహాన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న దీవెనతో ఎంపీనయ్యా...

- బాపట్ల ఎంపీ నందిగం సురేష్
- ఎర్రుపాలెం పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరు



గురువులను సత్కరిస్తున్న ఎంపీ సురేష్, పూర్వవిద్యార్థులు

ఎర్రుపాలెం: అద్దె సైకిల్‌కు డబ్బు లేని పేదరికం అనుభవించిన తాను.. ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దీవెన, దేవుడి ఆశీస్సులతో ఎంపీ అయ్యానని ఏపీలోని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి పూర్వ విద్యార్థిగా ఎంపీ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ వృత్తిలో కొనసాగుతూనే వైఎస్సార్ సీపీలో ఉన్న తనను జగన్ గుర్తించి ఎంపీగా చేశారని ఉద్వేగంతో చెప్పారు. తాను ఏ స్థాయికి ఎదిగిన పాఠాలు చెప్పిన గురువులు, సహచర మిత్రులను మరిచిపోలేదంటూ పేరుపేరున గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు, గురువులకు ఏ సమస్య ఎదురైనా తనకు ఫోన్ చేయాలని కోరారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్, భవనానికి రంగులు వేయించడమే కాక ఎర్రుపాలెం రింగ్ సెంటర్ – జయంతి రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆతర్వాత వివిధ రంగాల్లో సత్తా చాటిన విద్యార్థులు మల్లెల సాయిసుప్రియ, పుప్పాళ్ల తేజస్విని, చాముండేశ్వరిని సత్కరించిన ఆయన, ఇటీవల నిర్వహించిన కబడీ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. తొలుత జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని ఎంపీ దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్‌వలీ, ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ ప్రభాకర్, హెచ్‌ఎంలు దండెం సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్, పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, నాగరాజు, శివ, హరి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎర్రుపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు వేమిరెడ్డి మల్లారెడ్డి, షేక్ ఇస్మాయిల్, తిప్పాబత్తిన శౌరిల్‌బాబు ఎంపీ సురేష్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు.



కేసీఆరే నా కొడుకు..



పద్మతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం పాత మున్సిపల్ కార్యాలయంలోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పరీక్షలు చేయించుకున్న పలువురితో ఆయన మాట్లాడారు. ఈక్రమంలో వృద్ధురాలు పద్మతో 'కళ్లజోడు పెట్టుకున్నావు కదా మంచిగా కనిపిస్తోందా' అని ఆరా తీశారు. దీంతో ఆమె స్పందిస్తూ 'మంచిగా కనపడుతుందయ్యా కొడకా.. దండం పెడతా' అంటూ సమాధానం చెప్పారు. 'నాకు కొడుకులు లేరు.. కంటి పరీక్షలు ఉచితంగా చేయడమే కాక అద్దాలు ఇప్పించి కేసీఆరే నా కొడుకు' అని ఆమె సమాధానం చెప్పడంతో మంత్రి హర్షం వ్యక్తం చేశారు. దృష్టి లోపాలను దూరం చేసి, అంధ రహిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పువ్వాడ ఈ సందర్భంగా తెలిపారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్, రెవెన్యూ మేళాకు అందే ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కేఎంసీ సమావేశ మందిరంలో సోమవారం 28 మంది ఫిర్యాదులు అందజేయగా, అత్యధికంగా ఇంటి పన్నులు, పేరు మార్పుపైనే ఉన్నాయి. ఈసందర్భంగా కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రీవెన్స్, రెవెన్యూ మేళాలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతీ సోమ, బుధవారాల్లో రెవెన్యూ మేళా జరుగుతుందనే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, ఏఎస్ఓ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పిస్తాం..



ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

సత్తుపల్లిటౌన్: స్వయం సహాయక సంఘాల మాదిరి ట్రాన్స్‌జెండర్లు సంఘాలుగా ఏర్పాటైతే రుణాలు ఇస్తామని.. తద్వారా ఉపాధి యూనిట్ల ఏర్పాటుచేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ద్వారా అమలవుతున్న పథకాలను ఆమె పరిశీలించారు. ఈమేరకు స్థానిక వెంకగళరావునగర్‌లో ఉంటున్న 15 మంది ట్రాన్స్‌జెండర్లు అసిస్టెంట్ కలెక్టర్‌ను కలిసి రుణ సదుపాయం కల్పించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ మాదిరి పింఛన్ ఇప్పించాలని కోరగా ఆమె సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. అనంతరం జవహర్‌నగర్, అయ్యగారిపేట, రాజీవ్‌నగర్‌లో స్వయం సహాయ సంఘాల సభ్యులు ఏర్పాటుచేసిన ఒత్తులు, శారీ ప్రింటింగ్, న్యూట్రిషన్ పౌడర్ యూనిట్లను కూడా అసిస్టెంట్ కలెక్టర్‌ట్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, మెప్మా పీఆర్పీ గుడిపూడి సుజాత, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవలు అభినందనీయం



దివ్యాంగుడికి ఉపకరణం అందజేస్తున్న జిల్లా జడ్జి

ఖమ్మంలీగల్: దివ్యాంగులకు సమాజం చేదోడుగా, వాదోడుగా నిలవాలని.. ఈ విషయంలో రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యాన దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కల్పించడమే కాక ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ దివ్యాంగులు ఉచిత న్యాయానికి అర్హులని, వారికి అన్ని విషయాల్లో సమాన అవకాశాలు కల్పించడానికి న్యాయసేవాసంస్థ ఉపకరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి మూడు చక్రాల సైకిళ్లు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. న్యాయసేవా సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, రోటరీ క్లబ్ బాధ్యులు జగన్నాథం, మల్లాది వాసుదేవరావు, అక్బర్ పాషా, ఐతం రవీంద్ర, ఇమ్మడి లక్ష్మీనారాయణ, ఎం.కన్నాంబ తదితరులు పాల్గొన్నారు.



దాడి చేసి నగదు, ఆభరణాలు చోరీ

ఖమ్మంఅర్బన్: నగరం నడిబొడ్డున ఓ వ్యక్తిపై దాడి చేసి బంగారం, నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఘటనపై సోమవారం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మం రూరల్ మండలం తీర్థాలకు చెందిన నునావత్ నవీన్ తన సోదరి దుర్గతో బైక్‌పై ఆదివారం రాత్రి మమత రోడ్డునుండి కొత్తగూడెం వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆగగా, కొత్తగూడెం వైపు నుండి ముసుగులు వేసుకుని బైక్‌పై వచ్చిన ముగ్గురు నవీన్‌పై దాడి చేసి చేతికి ఉన్న రెండు ఉంగరాలు, రూ.వెయ్యి నగదు, సెల్‌ఫోన్‌తో పరారయ్యారు. ఈ ఘటనపై సోమవారం ఆయన చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశఖారు.

విద్యుత్ మోటార్లు...

నేలకొండపల్లి: మండలంలో రైతులు పొలాల్లో బిగించిన విద్యుత్ మోటారు కొద్దిరోజుల నుంచి చోరీ అవుతున్నాయి. తరచుగా జరుగుతున్న ఈ చోరీలతో పంటలు ఎండిపోతుండగా, రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా సోమవారం తెల్లవారుజామున మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన రైతులు చలవాది రామారావు, నూకమళ్ల వీరస్వామి వ్యవసాయ బావుల వద్ద మోటార్లను ఎత్తుకెళ్లారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ



ఘటనాస్థలంలో ఆటో, లారీ

కామేపల్లి(కారేపల్లి): ఆటోను లారీ ఢీకొట్టగా, ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం తాళ్లగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు డి.లీలావినోద, మోహన్‌రావు తదితరులు సోమవారం సాయంత్రం ఆటోలో ఖమ్మం బయలుదేరారు. ఈక్రమంలో మద్రిగూడెం సమీపాన వీరు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఘటనలో ఆటోడ్రైవర్‌తో పాటు, లీలవినోద, మోహన్‌రావుకు స్వల్పగాయాలు కాగా లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో క్షతగాత్రలను స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

అప్పుల బాధతో రైతు..



ధరావత్ రవి (ఫైల్)

తిరుమలాయపాలెం: అప్పుల బాధతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని బచ్చోడుతండాకు చెందిన ధరావత్ రవి (35) రెండెకరాల్లో మిర్చి, వరి సాగు చేయగా, తామ పురుగుతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే రవికి అప్పులు పెరగడంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఆదివారం మిర్చి తోట వద్ద పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాతర్లపాడులో వివాహిత..

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన వివాహిత కుమ్మరి నాగేంద్ర(25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె కలుపు మందు తాగగా, కాసేపటి గుర్తించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. అయితే, నాగేంద్ర ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఉరి వేసుకుని యువకుడు..

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో టేకురాం ముండా(25) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒడిశా రాష్ట్రంలోని కైర్‌బాడీకి చెందిన టేకురాం కుటుంబంతో కలిసి కాచిరాజుగూడెం ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన ఈనెల 21న శనివారం సహచరులను దూషించాడు. అయితే, మత్తు దిగాక వారు ఏమైనా అంటారేమోనని కలత చెంది, బట్టీ సమీపాన చెట్టుకు అదేరోజు రాత్రి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, సోమవారం ఆయన మృతదేహాన్ని గుర్తించడంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.